

మౌనిక.. అనుకున్నది సాధించేన్..

- ప్రత్యేక డీఎస్సీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు

న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం: ప్రభుత్వ ఉద్యోగం ఒకటి సాధించాలంటేనే కష్టంగా ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అయితే పుస్తకాలతో కుస్తీ పడితేనే అది సాధ్యమవుతుంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఓ మహిళా కానిస్టేబుల్ అబ్బురపరిచింది. సోదరుల నుంచి క్రమశిక్షణ, లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ఆమె.. స్పష్టమైన లక్ష్యంతో ఉపాధ్యాయ కొలువుపై గురిపెట్టి అనుకున్నది సాధించింది. బెల్లంపల్లి మండలం బూధఖుర్ద్ గ్రామానికి చెందిన వీర్ల రామయ్య, వజ్రమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. మౌనిక సోదరుడు వరుణ్ ఎక్సైజ్ ఎస్సైగా పనిచేస్తున్నారు. మరో సోదరుడు కిరణ్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. మౌనిక భర్త రాజు సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2012లో డిగ్రీ పూర్తి చేసిన మౌనిక 2017లో బీఈడీలో స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. 2020 సంవత్సరంలో కానిస్టేబుల్‌తో పాటు పంచాయతీ కార్యదర్శిగా రెండు ఉద్యోగాలు వచ్చాయి. అప్పటి నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. సోమవారం విడుదలైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ (స్పెషల్) ఫలితాల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఎలాంటి శిక్షణ లేకుండా మూడు ఉద్యోగాలను దక్కించుకుంది. ప్రస్తుతం బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది.

ఉపాధ్యాయురాలు కావాలన్న లక్ష్యం నెరవేరింది

మహిళా కానిస్టేబుల్ ఉద్యోగం ఉన్నప్పటికీ చిన్నతనం నుంచి ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యంగా ఉండేది. ఎలాగైనా టీచర్ ఉద్యోగం సాధించాలనే తపనతో చదివాను. కచ్చితమైన లక్ష్యముంటే గమ్యాన్ని చేరుకోవడం చాలా సులువు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో తల్లిదండ్రులతో పాటు సోదరుల ప్రోత్సాహం మరువలేనిది.


అండగా చట్టాలు.. ఆపదలో నేస్తాలు

- నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల బాగోగులు చూడటంలో కొందరు పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారు. చిన్న చిన్న కారణాలతో అనాథలుగా రోడ్డున పడేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యతల విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాలు తీసుకొచ్చింది. హక్కులు కాపాడటం, రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం.



అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న మందమర్రికి చెందిన లక్ష్మి (70)ని కూతురు, అల్లుడు చూడడం లేదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి భర్త పోశం సింగరేణి కార్మికునిగా పనిచేస్తున్న క్రమంలో చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. కాగా అందరి పెళ్లిలు చేసింది. లక్ష్మి బాధ్యతలు చిన్నకూతురు మరియమ్మ అల్లుడు జాని చూసుకుంటానని చెప్పడంతో పోశం సింగరేణి ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద ఇచ్చింది. కొన్ని నెలలుగా వారు పట్టించుకోకపోవడంతో పాటు తిడుతుండడంతో కలత చెందిన బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమశాఖ అధికారులు ఆమెను శ్రీ సాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు.




మందమర్రి పట్టణం, ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో వయోవృద్ధుల కుటుంబాలు : 1,580

వృద్ధాశ్రమాలు : 5

చట్టం ఏం చెబుతుందంటే..



- తల్లిదండ్రులను పోషించడానికి, వారి సంరక్షణ చర్యలు తీసుకోవడానికి పిల్లలు ముందుకు రాకుంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలి.
- 57 సంవత్సరాలు దాటిన వారు సీనియర్ సిటిజన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.
- ఆర్డీవో కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తుల పరిష్కారానికి ప్రత్యేకంగా న్యాయ సహాయ కేంద్రాలు (ట్రైబ్యునళ్లు) ఏర్పాటు చేశారు.
- ఫారం-ఏ నింపి దరఖాస్తును ఆర్డీవోకు ఇస్తే వారి స్థిర చరాస్తులు గతంలో పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ వాటిని రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఇచ్చే అధికారాన్ని చట్టం కల్పిస్తోంది.
- వారికి ఆహారం, దుస్తులు, నివాసం, మందుల ఖర్చులు భరించాలి. లేని పక్షంలో పోషణకు నెలకు రూ.10 వేలు చెల్లించాలి.
- 2007 చట్ట సవరణ ప్రకారం కొడుకులతో పాటు కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మైనార్టీ తీరిన మనుమలు, మనుమరాళ్లు కూడా వారి బాధ్యత స్వీకరించాలి.
- దరఖాస్తుల పరిష్కారానికి రెండు నెలల గడువు విధించారు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువును ఒక్కసారి మరో 30 రోజులు పొడిగించేందుకు విచారణాధికారికి వీలుంటుంది.

జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ

సీనియర్ సిటిజన్ల సంరక్షణ, పోషణకు జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, డీఆర్‌డీఓ, ఆర్డీవో, సీనియర్ సిటిజన్ ఫోరం, ఎన్జీవోల నుంచి ఒక మహిళతో సహా ముగ్గురు వయోవృద్ధులు, జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంరక్షణాధికారులు సభ్యులుగా ప్రత్యేక కమిటీ ఉంటుంది. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ఆయా సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

సంరక్షణ కోరుకునే వారు ఏం చేయాలంటే...

పిల్లలు తమను సంరక్షించకుంటే వారు ఆర్డీవో వద్దకు వెళ్లి ఫారం -ఏ నింపి అందజేయాలి. దీనికి న్యాయవాదితో కూడా అవసరముండదు. అధికారులు తగిన సహకారం అందిస్తారు. అనంతరం ఆర్డీవో విచారణ నిర్వహించి పోలీసులకు తదుపరి చర్యల కోసం రాసే అవకాశం ఉంటుంది. లోక్ అదాలత్‌లో అర్జి ఇవ్వగలిగితే న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి చర్యలకు ఆదేశాలు ఇచ్చే అవకాశముంది. మానవ హక్కుల కమిషన్ ద్వారా కూడా ఉపశమనం పొందే వీలు ఉంటుంది.



అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలు

కుటుంబ సభ్యుల నుంచి గెంటివేసిన, నిరాదరణకు గురైన, వీధిన పడిన వృద్ధులను వృద్ధాశ్రమాలు అక్కున చేర్చుకుంటున్నాయి. వారికి అన్నివిధాలా సేవలు అందిస్తూ ఆత్మీయుల్లా చూసుకుంటున్నాయి.



టోల్‌ఫ్రీ నెంబరు.. అందించే సేవలు

- వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా 14567 అనే హెల్ప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.
- మానసిక ఇబ్బందులు ఉన్నవారు సాయం పొందవచ్చు. నడవలేని వారికి చక్రాల కుర్చీలు, చేతికర్రలు సమకూరుస్తారు.
- వయోవృద్ధుల ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై స్థాయి వ్యక్తిని ప్రత్యేక అధికారి నియమించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారికి ఆరు నెలల నుంచి గరిష్ఠంగా 2 సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. రూ.10 వేల వరకు జరిమానా విధించేలా చట్టం రూపొందించారు.



ఎంపికైన అండర్-14 బాలుర విభాగం క్రికెట్ జట్టు సభ్యులు

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో సోమవారం జిల్లా స్థాయిలో అండర్-14 బాలుర విభాగంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మెరుగైన ఆటతీరును కనబరిచిన చిన్నారులను జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. వీరు అక్టోబర్ 2న నిర్మల్‌లో జరిగే పోటీల్లో తలపడనున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ క్రీడాకారుడు రామ్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు రేణి రాజయ్య, సిరంగి గోపాల్, బెల్లం శ్రీనివాస్, కరీ మున్నీసా, సాంబమూర్తి, ఇందిరా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు చేసుకోవాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత గలవారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులు ఫారం- 19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా, డిసెంబర్ 30న తుది జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.


నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు చేపట్టనున్నట్లు డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థులు (ఎంపికైనట్టు ఈ మెయిల్, చరవాణికి సందేశాలు వచ్చినవారు మాత్రమే) జిల్లా కేంద్రంలోని కార్మల్ కాన్వెంట్ హై స్కూల్‌లో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన ఉంటుందన్నారు.

యువత పెడదారి.. మార్పుతో మంచి నడవడి

- జిల్లా కేంద్రంలో పెరుగుతున్న విషసంస్కృతి

- జిల్లా కేంద్రంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడిని కిడ్నాప్ చేసి ఆయన వద్ద నుంచి డబ్బులు లాక్కెళ్లారు.
- మంచిర్యాల రైల్వేస్టేషన్ వద్ద ఓ ప్రయాణికుడిపై దాడి చేసి బ్యాగు అపహరించారు.
- స్థానిక కాలేజ్‌రోడ్డులో ఓ యువకుడు మద్యం మత్తులో కిరాణ దుకాణాలను ధ్వంసం చేశారు.
- క్వారీ ప్రాంతంతో పాటు శివారు ప్రాంతాల్లో ఏకాంతంగా గడుపుతున్న జంటలే లక్ష్యంగా కొందరు దాడులకు పాల్పడుతున్నారు.
- మంచిర్యాలలో జిల్లా కేంద్రంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలివీ..



మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే

అసాంఘిక కార్యక్రమాలను నిలువరిస్తామంటూ పదేపదే పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు.. జరుగుతున్న ఘటనలకు పొంతన ఉండడం లేదు. జిల్లాలో కొంతకాలంగా ఆకతాయిల అలజడి ఎక్కువైంది. హైదరాబాద్ వంటి నగరాల నుంచి మంచిర్యాల వరకు ఈ విష సంస్కృతి వేళ్లూనకముందే పోలీసులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎదురైంది. జిల్లాలో స్థిరాస్తి వ్యాపార లావాదేవీలలో సమస్యల పరిష్కారాలకు పలు గ్యాంగ్‌లు పుట్టుకొస్తున్నాయి. రూ. లక్షల సుపారీలు అందుకుంటున్న ఈ గ్యాంగ్‌లు తమ ఆధిపత్యం కోసం దాడులు చేసుకుంటున్నాయి. గత రెండు, మూడేళ్ల నుంచి జరుగుతున్న ఈ కార్యకలాపాలు నిలువరించకుంటే పరిస్థితి మరింత అదుపుతప్పే ప్రమాదం లేకపోలేదు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాత్రి వేళల్లో మద్యం, గంజాయి మత్తులో అతివేగంగా ద్విచక్రవాహనాలను నడుపుతున్న వారితో మాట్లాడాలంటే స్థానికుల్లో వణుకు పుడుతుందంటే వారి ప్రవర్తన ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవలి కాలంలో యువత తమ జన్మదిన వేడుకలను అర్ధరాత్రి రహదారులపై జరుపుకోవడం ఓ ఆనవాయితీగా వస్తోంది. ఏదైన గొడవలో ఓసారి జైలుకు వెళ్లి వస్తే తోటి స్నేహితులు, యువత అతడిని రోల్‌మోడల్‌గా చూసే పరిస్థితి నెలకొంది. ఇలాంటి వాటిని పోలీసులు ఏ మాత్రం నిలువరించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాతో పాటు పక్క జిల్లా ప్రభావం..

మంచిర్యాలలో యువత పరస్పర దాడులు సహజంగా మారాయి. గత ప్రభుత్వంలో కొందరికి అప్పటి నాయకులు అండగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత దాడులకు ఇప్పటి నాయకులు అభయమిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి దాడులను నిలువరించాలంటే పోలీసులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదు. గడిచిన గొడవల్లో తలదూర్చిన వారిలో జిల్లాకేంద్రంలోని కోల్ బెల్ట్ ప్రాంత యువకులతో పాటు పెద్దపల్లి జిల్లాలోని వారు ఉన్నారు. గోదావరిఖనిలో గ్యాంగ్ వార్‌ల ప్రభావం ఎప్పటి నుంచో ఉంది. అక్కడి నీడ ఇక్కడ పూర్తి స్థాయిలో పడకుండా సంబంధిత అధికారులు కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

రైళ్ల రద్దు.. ప్రయాణికుల ఇబ్బందులు

- సెలవుల్లో రాకపోకలకు ప్రయాస

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే



మంచిర్యాల రైల్వేస్టేషన్

విద్యాసంస్థలకు ఈ నెల 2 నుంచి సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్ నుంచి మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు వచ్చే వారంతా ఇబ్బందులు పడనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వరంగల్, హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య నాలుగో రైల్వేలైను పనుల నేపథ్యంలో పలు సర్వీసులను రద్దు చేశారు. సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 7, 8 తేదీల వరకు సికింద్రాబాద్‌కు వెళ్లే ప్రధాన రైళ్లు నిలిచిపోవడంతో జిల్లావాసులు ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వస్తుంది. మొదటి నుంచి ప్యాసింజర్ రైళ్ల ఏర్పాటులో ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతూనే ఉంది. దీనికి తోడు మూడు, నాలుగు రైల్వేలైను పనులతో తరచూ రైళ్లను రద్దు చేస్తున్నారు. కొత్తగా రైళ్ల కూతలు లేకపోగా కోతలు ఉంటున్నాయి. ప్రస్తుతం ప్రధానరైళ్లు రద్దు కావడంతో మంచిర్యాల, కుమురంభీం జిల్లాల ప్రజలు రైలు ప్రయాణానికి ప్రయాస పడక తప్పడం లేదు.

రాజధానికి రైళ్ల కరవు..

మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి నిత్యం సుమారు 6 వేల మంది పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో 4 వేల వరకు రాజధానికే వెళ్తుంటారు. నిత్యం 5 గంటలకు మంచిర్యాల నుంచి బయలుదేరే భాగ్యనగర్‌తో పాటు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దయ్యాయి. రోజువారీగా నడిచే ఈ రైళ్లతో పాటు వీక్లీ రైళ్లు నడవడం లేదు. కొత్తగూడెం వెళ్లే సింగరేణి, కరీంనగర్‌కు వెళ్లే పుష్పుల్, కాజీపేటకు వెళ్లే రామగిరిలు రద్దు చేశారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతనపల్లి ప్రాంతాల నుంచి జమ్మికుంట, ఓదెల, కొలనూరు, కాజీపేట, వరంగల్‌కు నిత్యం చాలా మంది ప్రయాణిస్తుంటారు. సింగరేణి కార్మికులుగా పనిచేస్తున్న వారిలో చాలామంది పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందినవారే. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో హైదరాబాద్ నుంచి తమ పిల్లలను తీసుకురావాలంటే రైళ్లు లేకపోవడంతో జిల్లావాసులు ఇతర మార్గాలను ఎంచుకోవాల్సి వస్తుంది. రైలులో దూరభారంతో పాటు సమయం, డబ్బులు కూడా తక్కువే. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే డబ్బులతో పాటు సమయం వృథా కానుంది.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోటపల్లి, న్యూస్‌టుడే : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. సోమవారం చెన్నూరు రూరల్ సీఐ కార్యాలయంతో పాటు కోటపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తనిఖీలు, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేసి ప్రాణహిత సరిహద్దు గ్రామాలు, ఈ ప్రాంతం నుంచి మావోయిస్టు పార్టీలో ఉన్నవారి వివరాలు, కేసులు నమోదవుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రామీణ సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.



కస్తూర్బాలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

కోటపల్లి, న్యూస్‌టుడే : బతుకమ్మ సంబరాల్లో భాగంగా సోమవారం కోటపల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పండగ విశిష్టతను చాటిచెప్పారు. అనంతరం వారితో కలిసి బతుకమ్మ ఆడారు. ప్రిన్సిపల్ హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో 6903 కేసులు పరిష్కారం

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : న్యాయస్థానాలలో సెప్టెంబరు 28న నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో 6903 కేసులు పరిష్కారమైనట్లు సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సైబర్‌క్రైం కేసులకు సంబంధించిన రూ. 17,01,816 లను బాధితులకు ఇప్పించేందుకు న్యాయస్థానాల ద్వారా బ్యాంకు అధికారులకు ఆర్డర్ కాపీలను అప్పజెప్పామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేశారన్నారు.

నిశిరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురి దుర్మరణం
- గుడిహత్నూరు మండలం మేకలగండి వద్ద ఘటన

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

వారంతా నిశిరాత్రి కారులో ఇంటికొస్తున్నారు. మరో 15 నిమిషాలైతే ఇంటికి చేరేవారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను రాసుకుంటూ దూసుకెళ్లింది. అదుపు తప్పి సిమెంట్‌కాల్వలో బోల్తాపడటంతో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారి-44 పై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అదుపు తప్పిన కారు డివైడర్‌ను రాసుకుని దాదాపు వంద మీటర్లు వెళ్లి ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో మోయిజ్(60), అలీ(8), ఖాజా మోయినొద్దీన్(40), మొహమ్మద్ ఉస్మానుద్దీన్(11) దుర్మరణం పాలయ్యారు. ఆయేషా అఫ్రీన్, ఫరీద్, ఎక్రా, సాథ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని సంఘటనా స్థలం నుంచి మూడు 108 అంబులెన్స్‌ల ద్వారా రిమ్స్‌కు తరలించారు. వీరంతా ఆదిలాబాద్‌కు చెందినవారే. మేకల గండి నుంచి ఆదిలాబాద్ 15 కి.మీ.దూరం. 15 నిమిషాల్లో ఇంటికి చేరే వారని అంతలోనే మృత్యువు కబళించిందని బంధువులు రోదించారు.



ప్రమాదం ఊహాచిత్రం



మృతులు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

అంతర సాగు.. ఆదాయం బాగు..

అరటికి ప్రత్యేక రాయితీ



ఆయిల్‌పామ్‌లో అరటిని అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 50 నుంచి 57 వరకు ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేస్తారు. అయితే అరటిని మధ్యలో ఎకరానికి 1200 వరకు మొక్కలు సాగు చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీ ఇస్తుంది. 11 నెలలకు ఒకసారి చేతికి వచ్చే అరటి వల్ల ఎకరానికి రూ. ఒక లక్ష అదనంగా ఆదాయం పొందే అవకాశముంది.

సోయాబీన్.. గిట్టుబాటు



ఆయిల్‌పామ్‌లో సాగు చేసే మరో పంట సోయాబీన్.. మూడు నెలల పంట. దీన్ని రెండు ఆయిల్‌పామ్ సాళ్ల మధ్య ఆరు నుంచి ఏడు సాళ్లు సాగు చేయవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు చేతికి వస్తుంది. రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు అదనంగా ఆదాయం పొందే అవకాశముంది. దీని తర్వాత తిరిగి శనగను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. వీటితో పాటు పత్తి, అరటి, ఉల్లి, కూరగాయలు, కందిని అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. ప్రధాన పంటలో మధ్యమధ్య సాళ్లలో వీటిని సాగు చేయడం వల్ల ఆయిల్ పామ్‌తో పాటు అంతర పంటలతో అదనంగా ఆదాయం పొందే అవకాశముంది

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు ఇప్పుడిప్పుడే ఉద్యాన వన పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ఏటా సాగు పెరుగుతోంది. సాగు పెంచేందుకు రాయితీలు అందజేస్తూ ప్రోత్సహిస్తుండటంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇందులో అంతర పంటలు సాగు చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉండటం... దీనికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో రైతులు ఆయిల్ పామ్‌లో అంతరపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఒకే చేనులో.. ఒకే పెట్టుబడితో రెండు రకాల పంటలు పండించడం తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అంతరపంటలపై దృష్టి సారిస్తే మరింత దిగుబడి సాధించవచ్చని మంచిర్యాల క్లస్టర్ ఉద్యానవన అధికారి సహజ వివరించారు.

రైతేరాజు

రాయితీ ఇలా:

రైతులు దీనిని ఎన్ని ఎకరాల్లోనైనా సాగు చేసుకోవచ్చు. ఒక మొక్క ధర రూ. 193 కాగా దీనిని రూ. 20కే అందిస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా రైతులు ఎకరాకు రూ. 1100 చెల్లించాలి. బిందు సేద్యం రాయితీని ఒక రైతుకు పన్నెండున్నర ఎకరాలలోపు మాత్రమే అందిస్తారు. అంతర పంటలు సాగు చేస్తే మొక్కలు పెరిగే వరకు నిర్వహణకు ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారు.

నేరుగా మిల్లుకు..



ఆయిల్‌పామ్ మధ్యలో సరుగుడు మొక్కలను ఎకరానికి రెండు వేలు నాటవచ్చు. రెండేళ్ల తర్వాత పెరిగిన చెట్ల కొయ్యలు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు. వీటిని నేరుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని మిల్లుకు తరలిస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. రవాణాతో కలిపి ఒక్కో మొక్కకు రూ. 2.50 పైసల ఖర్చు వస్తుంది. పెరిగిన తర్వాత కంపెనీ వారే రైతుల చేలల్లోకి వచ్చి ఉచితంగా చెట్లను కొట్టించి తీసుకెళ్లి పంటను బట్టి డబ్బులు అందజేస్తారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి. చరవాణి సంఖ్య: 91002 29854

?: బెండలో పచ్చదోమ ఆశిస్తోంది. ఎలా నివారించవచ్చు? **శంకర్ రైతు, తంగిడిగూడ**

: నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

జీవాలలో నీలి నాలుక వ్యాధి నివారణ ఇలా..

మీకు తెలుసా?

జీవాలలో ఎక్కువగా వచ్చేది నీలి నాలుక వ్యాధి. ఇది రియోవైరస్ అనే కుటుంబానికి చెందిన వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వల్ల రక్త కణాలు దెబ్బ తినడంతో పాటు రక్త నాళాలు వాస్తాయని పశువైద్యాధికారి డా.ధన్‌రాజ్ పేర్కొన్నారు. దీంతో పాటు కాళ్ల గిట్టల వద్ద పుండ్లు దీనివల్ల నడవడం ఇబ్బందిగా మారి కుంటుతాయని వివరించారు. ఈ వ్యాధి నివారణకు ఉప్పు కలిగిన గంజి, రాగి జావ, ఓఆర్ఎస్ ద్రావణం క్రమం తప్పకుండా తాగించాలని వివరించారు. దీంతో పాటు ముందస్తుగా టీకాలు వేయించాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

పండగల వేళ.. లాభాల బంతి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం : సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అన్నదాతలకు ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. ఇప్పుడు పూలకు భలే గిరాకీ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బంతి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు ఆదిలాబాద్ గ్రామీణ మండల కచ్‌కంటి గ్రామానికి చెందిన కొమ్ముల సంజీవ్.



సంజీవ్ సాగు చేస్తున్న బంతి తోట

ఆదర్శం

కచ్‌కంటి గ్రామానికి చెందిన కొమ్ముల సంజీవ్ బంతిపూలను సాగు చేస్తున్నారు. ఆరు ఎకరాలు కౌలు తీసుకొని నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మిగతా భూమిలో సంజీవ్ బంతి పూల సాగు చేపట్టారు. పండగల వేళ దిగుబడి వచ్చేలా ప్రణాళికతో పచ్చ, ఎర్ర బంతి మొక్కలు నాటారు. లక్ష పెట్టుబడిగా పెట్టగా.. విత్తనాలకు రూ.50 వేలు ఖర్చు చేశారు. నాలుగు నెలలకే దిగుబడి చేతికొచ్చింది. ఇప్పటికే వినాయక చవితి పండగకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. ఒక ఎకరానికి 5 నుంచి 6 టన్నుల బంతి పూలు దిగుబడిగా వస్తున్నాయని సంజీవ్ చెబుతున్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే లక్షన్నర లాభం వస్తోందని ఆనందంగా చెబుతున్నారు. పలువురు బంతిపూలు సాగు చేస్తున్నారు. వ్యాపారులు తోట వద్దకే రావడం.. స్థానిక మార్కెట్‌లోనే పూలను విక్రయించడంతో రవాణా ఖర్చులు లేకపోవడంతో అనుకున్నంత లాభం వస్తోంది. దసరా, దీపావళికి పూల ధరలు పెరగడంతో మరింత మెరుగైన ఆదాయం వస్తోందని అంటున్నారు.

భారీగా ఆశలు తీరాలి బాధలు



పెన్‌గంగపై నిర్మాణంలో ఉన్న చనాఖా కొరాట రిజర్వాయర్



ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ప్రాజెక్టుల్లో 75 శాతం, అంతకన్నా ఎక్కువ నిర్మాణం పూర్తయిన వాటికి అవసరమైన నిధులిచ్చి పనులు పూర్తి చేసి సాగు నీరు అందించే ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో అయిదు ఉన్నట్లు గుర్తించారు. మొదటి కేటగిరీలో నాలుగు ప్రాజెక్టులుండగా రెండో కేటగిరీలో ఒక ప్రాజెక్టు ఉంది. ప్రస్తుతం రూ. 167.83 కోట్లు మంజూరు చేస్తే వచ్చే వానాకాలంలో 28 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదించడంతో నిధుల విడుదలకు సీఎం అంగీకరించడంతో ఆశలు చిగురించాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18కిపైగా ప్రాజెక్టులు ఉన్నా వీటిలో చాలా వరకు కొద్ది మొత్తంలో పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. తక్కువ ఖర్చుతో వానాకాలం సీజన్‌లో సాగు నీటిని అందించే ప్రాజెక్టులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం, సదర్మాట్‌తోపాటు మంచిర్యాల జిల్లాలో నీల్వాయి ప్రాజెక్టు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

రెండో కేటగిరీలో పెన్‌గంగ

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కింద 50,800 ఎకరాలకు సాగు నీరు అందాలి. ప్రాజెక్టు పరిధిలో చనాఖా కొరాట రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు పూర్తి చేస్తే వచ్చే వానాకాలం సీజన్‌లో 27,794 ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందుకు రూ. 147.23 కోట్లు అవసరం. ప్రతి నెల ఎంత మొత్తం అవసరమో అంచనాకు రావడంతో పాటు ఈ నిధులను క్రమం తప్పకుండా ఇవ్వాలని, అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయగలుగుతామని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ప్రాజెక్టులు, నిధుల అవసరం, సాగులోకి వచ్చే ఎకరాలు

ప్రాజెక్టు	నిధులు	ఎకరాలు
లోయర్ పెన్‌గంగ	147.23	27,794
మత్తడివాగు	4.39	1,200
సదర్మాట్	97.37	18,016
పిప్రి	49.07	4,214
నీల్వాయి	17.00	5,000

● నిర్మల్, జగిత్యాల జిల్లాలకు మేలు చేసే సదర్మాట్ ప్రాజెక్టు చివరి దశలో ఉంది. రూ. 97.37 కోట్లు వెచ్చిస్తే 18 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. దీనికి విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● మంచిర్యాల జిల్లా పరిధిలోని నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. ఇటీవల రూ.50 లక్షలు అటవీశాఖకు చెల్లించడంతో అనుమతులు వచ్చే వీలుంది. రూ. 17 కోట్లు మంజూరు చేస్తే ఎడమ కాలువ కింద 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కింద కాలువలు లేకుండా సాగు నీరు అందించేందుకు వీలుగా పనులు పూర్తికాగా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. వీటికి రూ. 4.39 కోట్లు విడుదల చేస్తే అదనంగా మరో 1200 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలో మోటార్లు, పైప్‌లైన్, విద్యుత్తు సౌకర్యం తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. రూ. 49.07 కోట్లు మంజూరు చేస్తే 4,214 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయండి

ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్

ఉట్నూరు, ఇంద్రవెల్లి న్యూస్‌టుడే : గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ఆదేశించారు. సోమవారం ఉట్నూరు పీఎమ్మార్సీలో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు క్షేత్రస్థాయి నుంచే ఎంపికను చేపట్టాలన్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పథకాల మంజూరు పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి దేశంలో ఆదర్శ జిన్నింగ్‌గా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి కృషి చేస్తామని ఆయన అన్నారు. నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రవెల్లి గిరిజన అమరవీరులకు నివాళులర్పించారు. సేంద్రియ ఎరువుల ద్వారా కూరగాయలు సాగు చేస్తే వారికి రాష్ట్ర రాజధానిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ట్రైకార్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు కృషి చేస్తారన్నారు. ఏపీఓ(జనరల్) జాదవ్ వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, లక్ష్మిప్రసాద్, ఈఈ రాథోడ్ భీంరావు, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు,అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఎడ్లబండిపై తీసుకొచ్చి.. అభిమానాన్ని చాటి



ఉపాధ్యాయురాలిని తీసుకొస్తున్న విద్యార్థులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కొమ్మెర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన గోసంగారి విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇంతకాలం పాఠాలు బోధించిన ఉపాధ్యాయురాలు విరమణ పొందడంతో విద్యార్థులు వినూత్న రీతిలో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎడ్లబండిని అందంగా అలంకరించి అందులో ఉపాధ్యాయురాలిని కూర్చోబెట్టి పూలు చల్లుతూ పాఠశాల వరకు విద్యార్థులే తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలేఖ్య ఆసనాలకు.. పతకాలు ఫిదా

● జాతీయ స్థాయిలో రాణింపు

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే :

కఠినమైన ఆసనాలను సులభంగా సాధన చేస్తూ రాణిస్తున్నారీ యువతి. జాతీయస్థాయిలో పతకాల పంట పండించడంతోపాటు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఇలా తన ప్రతిభతో నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు గోలేటికి చెందిన కేసరి అలేఖ్య.



ఏరియల్ యోగా చేస్తున్న అలేఖ్య

రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన కేసరి ఆంజనేయులు గౌడ్, పద్మ కుమార్తె అలేఖ్య యోగాలో ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పది వరకు చదువుకున్న ఆమె హనుమకొండలో ఇంటర్, డిగ్రీ కోర్సులను పూర్తి చేశారు. బెంగళూరులో యోగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని, ఎన్ఐఎస్‌లో యోగా కోర్సు, చెన్నైలో ఎంఎస్సీ(యోగా) చదివారు. తమిళనాడులోని మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పూర్తి చేశారు. జల, ఏరియల్, ప్రెగ్నెన్సీ, కిడ్స్ యోగా ఇలా ఒక్కొక్క దాంట్లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో 2023లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రెఫరీగా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించే స్థాయికి ఎదిగారు.



యోగా శిక్షణ ఇస్తున్న అలేఖ్య

న్యాయనిర్ణేత స్థాయికి..

- 2016 సంవత్సరంలో కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలో పతకం సాధించారు.
- 2017లో హైదరాబాద్, మంచిర్యాల, నిజామాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నారు.
- 2018 విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి పతకం తీసుకొచ్చారు.
- 2019లో నాగ్‌పూర్, 2020లో బెంగళూరులో జరిగిన పోటీల్లో నోబుల్ వరల్డ్ రికార్డులో పాల్గొన్నారు.
- గత నెల 23-27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి ఆలిండియా పోలీసు గేమ్స్‌లో రెఫరీగా వ్యవహరించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

అలేఖ్య ఇంటర్ చదువుతున్న రోజుల్లో కొంత అనారోగ్యానికి గురైంది. అప్పటికే బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో యోగా నేర్చుకుంటున్న తండ్రి ఆంజనేయులుగౌడ్ విషయం తెలుసుకుని కుమార్తెను యోగాపై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఉచితంగా నేర్పిస్తున్న యోగా శిక్షణలో చేరారు. కఠోర సాధన చేస్తూ ఆసనాలు చేయడం ప్రారంభించారు. 13 ఏళ్లుగా నిత్యం సాధన చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. 'వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరైనా యోగా సాధన చెయొచ్చు. సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎనిదేళ్లుగా సాధన చేస్తున్నా. అమెరికా, దుబాయ్, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నా. అంతర్జాతీయ స్థాయి యోగా శిక్షకురాలిగా ఎదగాలనేది నా లక్ష్యం' అని అలేఖ్య అన్నారు.

కేంద్రంలో భాజపా ప్రభుత్వం కూలుతుంది : రవి



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

ఆదిలాబాద్ అర్బన్: కేంద్రంలో భాజపా ప్రభుత్వం త్వరలో కూలుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మహారాష్ట్రలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో యావత్మాల్ జిల్లాకు పార్టీ పరిశీలకుడిగా నియమితులైన ఆయన మహారాష్ట్రకు వెళ్తూ ఆదిలాబాద్ పట్టణంలో ఆగారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఆస్తి తగాదాలతో మహిళ హత్య

మంచిర్యాలనేరవిభాగం: ఆస్తి తగాదాలతో ఓ మహిళ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ బన్సీలాల్ కథనం మేరకు.. పట్టణంలోని మేదరివాడలో సోమవారం మధ్యాహ్నం చింత విజయలక్ష్మి (47) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలి శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. చేతులు, మెడపై బలంగా దాడి చేయడంతోనే ఆమె చనిపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కొంత కాలంగా తమ బంధువులతో ఆస్తి తగాదాలు ఉన్నాయని, వారే హత్య చేసి ఉంటారని మృతురాలి కూతురు రాపాల భవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలి భర్త రామ్‌శంకర్ కొన్ని సంవత్సరాల క్రితమే మృతి చెందాడు.



విజయలక్ష్మి

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ.. జాతీయ స్థాయికి ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన రాహుల్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకోగా వైష్ణవి రెండవ స్థానంలో రజతం గెలుచుకుంది. వీరు త్వరలో కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతివర్మ, ప్రధాన కార్యదర్శి మండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

విద్యా.. ఉపాధికి మార్గం

నేటి పోటీ ప్రపంచంలో తమ ఆలోచనలకు అనుగుణమైన విద్యా కోర్సుల ఎంపికతో పాటు నైపుణ్యానికి అనువైన ఉద్యోగాల వేట కోసం సరైన సమయంలో సమాచారం అందడం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఎన్ని నైపుణ్యాలు, ఎన్ని విద్యార్హతలు కలిగి ఉన్నా దానికి సంబంధించిన సమాచారం, దరఖాస్తు చేసే విధానం, ఆఖరు తేదీ వంటి అంశాలు తెలిసినపుడు ఉద్యోగార్థులకు, ఉన్నత విద్యనభ్యసించదలిచే విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన 'నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ టోల్‌ఫ్రీ నెంబరుతో విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యలను తీరుస్తోంది. -న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్

గ్రామీణ విద్యార్థులకు మేలు..

మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సేవ చాలా మేలు చేకూర్చేలా ఉపయోగపడుతోంది. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నా తగిన ఉద్యోగ సమాచారం సరైన సమయంలో తెలియక నష్టపోతున్నారు. ఈ సేవను వినియోగించుకుంటే ఈ సమస్యను చాలా వరకు అధిగమించవచ్చు.

nirmaan.org Vidya Helpline ...Enlightening Young India
We have only one passion the rise of a great Nation

హెల్ప్‌లైన్‌లో ప్రత్యక్ష సంభాషణ

నెంబరును ప్రెస్ చేసిన అనంతరం టెలీకాలర్ అందుబాటులోకి వస్తారు. మనకు కావలసిన, మన సందేహాలకు నిపుణులు తగిన సమాచారాన్ని వెంటనే అందజేస్తారు. ప్రస్తుతం మన విద్యార్హతలు ఏమిటి అనే దాని ఆధారంగా ఎలాంటి ఉద్యోగాలకు అర్హులం లేదా ఇంకా అందుబాటులో ఉన్న ఉత్తమమైన కోర్సులు ఏవి అనే అంశాలను లోతుగా తెలుసుకోవచ్చు.

టోల్‌ఫ్రీ నెంబరుతో అందుబాటులో..



1800 425 2425 అనే టోల్ ఫ్రీ నెంబరుకు పని దినాలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత కాల్ చేయొచ్చు. మొదట కంప్యూటర్ వాయిస్ ద్వారా వచ్చే సూచనలకు అనుగుణంగా విద్యా.. లేక ఉద్యోగ సమాచారమా అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులు తాము ఏ భాషలో సమాచారం పొందగోరుతున్నారో దానికి అనుగుణంగా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

వాట్సాప్ ద్వారా..

విద్యా, ఉద్యోగ సమాచారం కోసం 90009 72653 నెంబరుకు వాట్సాప్ ద్వారా పేరు, జిల్లా పేరు, విద్యార్హత వివరాలను పంపాలి. తద్వారా ఆ నెంబరు రిజిస్టర్ అయ్యి సమాచారం నిత్యం ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా అందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి సమాచారం వాట్సాప్‌లో మనకు కనిపిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

చెన్నూరు, న్యూస్‌టుడే :

? పట్టణంలోని శివాలయం, కోటబొగుడ, జెండా వీధిలో కొద్ది రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా కావడం లేదు.
- పోగుల పురుషోత్తం, స్థానికుడు

✔ ఐతక్కమ్మవాగులో ప్రధాన పైపులైను దెబ్బతింది. మరమ్మతులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల్లో యథావిధిగా నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.
- సాయికిరణ్, ఏఈ, చెన్నూరు మున్సిపాలిటీ

బోరు మోటారు బిగింపు



భీమారం, న్యూస్‌టుడే : కాజీపల్లి గ్రామంలోని కురుమవాడలో బోరు మోటారు చెడిపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందిపై ఈ నెల 27న 'మేమున్నాం మీకుతోడుగా'లో ప్రచురితమైన సమస్యపై పంచాయతీ అధికారి రాజశేఖర్ స్పందించారు. కాలిపోయిన మోటారుకు మరమ్మతులు చేపించి తిరిగి బిగింపజేశారు.

ఫిర్యాదులు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

ఏసీసీ, న్యూస్‌టుడే : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు బారులు తీరారు. తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ బాధితులు కలెక్టర్‌ను వేడుకొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రోడ్డు సౌకర్యం కల్పించరూ



నస్పూర్ మండలం నాగార్జున కాలనీలో సంవత్సరాలుగా అక్కడే నివాసముంటున్నాం. కాలనీలో రోడ్డు సదుపాయం లేక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర వేళ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నస్పూర్ రోడ్డు నుంచి సపోట తోట వరకు రోడ్డు అనుసంధానం చేసి సమస్య పరిష్కరించాలి. - కాలనీవాసులు, నస్పూర్

ప్రభుత్వ భూములు కాపాడాలి



వేమనపల్లి మండలంలోని దస్నాపూర్ గ్రామ సరిహద్దుల్లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల భూమి, పెద్ద చెరువు శిఖం భూములు కబ్జాకు గురయ్యాయి. సర్వే నెం 40లో 30.18 ఎకరాలు ఉండాల్సిన చెరువు భూమి ప్రస్తుతం 15 ఎకరాలు మాత్రమే ఉంది. దీనిపై విచారణ జరిగిన ప్రభుత్వ భూములను కాపాడాలి.
- దుర్గం నగేష్, కొత్తపల్లి, వేమనపల్లి

పంట రుణాలు ఇప్పించాలి

కన్నెపల్లి మండలం దాంపూర్ పంచాయతీకి చెందిన మేము ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం అందించిన పోడు పట్టా పుస్తకాలు సైతం తీసుకున్నాం. గత ప్రభుత్వంలో అందించిన రైతుబంధుతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయం సైతం అందుతోంది. కాగా పంట రుణాల కోసం బ్యాంకుకు వెళ్తే ఇవ్వట్లేదు. ఉన్నతాధికారులు స్పందించి పంట సాగుకు రుణాలు ఇప్పించి ఆదుకోవాలి.
-రైతులు, దాంపూర్, కన్నెపల్లి



అక్రమ పట్టా చేయవద్దు



- కిరణ్‌కుమార్

నేను వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత ఏడాది అక్టోబరు 10న కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇంటిని, సంబంధిత భూమిని బెల్లంపల్లికి చెందిన ఓ టిఫిన్ సెంటర్ యజమాని ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. తమ ఇంట్లో వారి సామాన్లు పెట్టి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. అక్రమ పట్టా చేయకుండా న్యాయం చేయాలి.
- బైరి కిరణ్‌కుమార్, కన్నాలబస్తీ బెల్లంపల్లి

కూతురుకు పింఛను ఇప్పించాలి



నా కూతురు జోడే శివాన్‌శ్రీ పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు. సదరం శిబిరంలో పరీక్షించి 100 శాతం సదరం దివ్యాంగ ధ్రువపత్రం జారీ చేశారు. ఒంటరిగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. గతంలో ఆసరా పింఛను కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. అధికారులు స్పందించి పింఛను మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలి.
- శివాన్‌శ్రీ తల్లి, అశోక్‌రోడ్, మంచిర్యాల

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : దండేపల్లి మండలం పాతమామిడిపల్లి గ్రామానికి చెందిన కొప్పుల బుచ్చయ్య (50) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం మేరకు.. బుచ్చయ్య నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్తానని అప్పులు చేసి మోసపోవడంతో వెళ్లలేదు. అప్పులు అలాగే మిగిలాయి. దీంతో చేసిన అప్పులకు మేదరిపేటలో ఉన్న కొంత భూమిని విక్రయించాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలని బాధపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకు కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బుచ్చయ్య

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరి దుర్మరణం

నస్పూర్, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం అదుపుతప్పి విభాగిని (డివైడర్) ఢీకొని కింద పడటంతో యువకుడు దుర్మరణం చెందాడు. నస్పూర్ ఎస్సై సుగుణాకర్ కథనం మేరకు... శ్రీరాంపూర్‌కు చెందిన వంగ శ్రీనివాస్ (38) వస్త్ర దుకాణం యజమాని. పని నిమిత్తం ఆదివారం సాయంత్రం స్నేహితుడు రాకేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వచ్చాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాత్రి నస్పూర్ సమీపంలో ద్విచక్రవాహనం అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయాడు. శ్రీనివాస్ తలకు బలంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



శ్రీనివాస్

షెడ్లు కూల్చివేసిన వారిపై కేసు

మంచిర్యాలనేరవిభాగం : స్థానిక శ్రీశ్రీనగర్‌లోని ఉమర్‌మియా సొసైటీలో రేకుల షెడ్లు కూల్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సీసీసీకి చెందిన విశ్రాంత సింగరేణి కార్మికుడు చీపల్లి దుర్గయ్యతో పాటు ఇతరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మినాజోద్దీన్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాండూరు, న్యూస్‌టుడే : గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తాండూరు ఎస్సై కిరణ్‌కుమార్ కథనం మేరకు. . కిష్టంపేట గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారంతో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎనిమిది గంజాయి మొక్కలు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుర్గయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

పరిధి దాటి వైద్య సేవలు.. రిమాండ్‌కు పీఎంపీ

నస్పూర్, న్యూస్‌టుడే : నిబంధనలు విస్మరించి చికిత్స అందించి ఓ మహిళ మృతికి కారణమైన పీఎంపీ వైద్యుడిని సోమవారం రిమాండ్‌కు తరలించామని మంచిర్యాల గ్రామీణం సీఐ అశోక్ పేర్కొన్నారు. నస్పూర్ పురపాలికలోని నాగార్జున కాలనీకి చెందిన చింతం శ్రీలత శనివారం జ్వరం రావడంతో భర్త రాజు స్థానిక పీఎంపీ ప్రశాంత్‌ను సంప్రదించాడు. దీంతో పీఎంపీ ఆమెకు సెలైన్ ఎక్కించటంతో పాటు రెండు చేతులకు రెండు ఇంజక్షన్లు ఇచ్చాడు. ఆమె అపస్మారక స్థితిలో వెళ్లగా భర్త హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు ప్రశాంత్‌ను రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు.



నిందితుడి రిమాండ్ చూపుతున్న పోలీసులు

జూద స్థావరంపై దాడి?

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా సమీపంలో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నారన్న సమాచారంతో స్థావరంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 30,970 నగదు, 11 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. పట్టుబడిన వారిలో లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన రాజకీయ నాయకులు ఉన్నట్టు సమాచారం.

గల్ఫ్ కార్మికుని కూతురికి ఎంబీబీఎస్ సీటు

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు దుమల్ల ఎల్లయ్య(రెడ్డి)కూతురు దుమల్ల నాగమణి ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఇంటర్ లక్షెట్టిపేటలోని గురుకుల కళాశాలలో చదివారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదివి ఎంబీబీఎస్ సాధించిన నాగమణిని గ్రామపెద్దలు అభినందించారు. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆమెకు సీటు దక్కింది. గల్ఫ్‌లో నాన్న పడుతున్న కష్టాలను చూసి డాక్టర్ కావాలని పట్టుదలతో చదివానని గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా నాగమణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

నెన్నెల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సర్దుబాటుపై జారీ చేసిన అసంబద్ధమైన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. కన్నెపల్లి మండల జిల్లా పరిషత్ పాఠశాలలో తపస్ అభియాన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చెన్నూరు, న్యూస్‌టుడే : చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, చెన్నూరు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి రవి సూచించారు. సోమవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. సదస్సుకు హాజరైన ఆయన మహిళా చట్టాలు, బాలికల భద్రత, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టుబట్టి.. ఫలితాల్లో మెరిసి

దండేపల్లి గ్రామీణం, దండేపల్లి, న్యూస్‌టుడే: సర్కారు కొలువు సాధించాలని యువత కలలుకంటారు. వాటిని కొందరే సాకారం చేసుకుంటారు. పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువగా ఉండటమే కారణమంటూ చెబుతుంటారు. అయితే కృషి, పట్టుదల నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయతీరాలకు చేరవచ్చని నిరూపిస్తున్నారు కొందరు. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పలువురు యువకులు మెరిశారు.

సమకాలీన అంశాలపై పట్టుంటే..



దండేపల్లి మండలం నర్సాపూర్‌కి చెందిన పూరేళ్ల చిన్నలక్ష్మణ్, లక్ష్మి దంపతుల కుమార్తె అఖిల. చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండే అఖిల డీఎస్సీకి సమాయత్తం అయ్యింది. 29వ ర్యాంకుతో ఉపాధ్యాయ కొలువు సాధించింది. సమకాలీన అంశాలపై దృష్టి సారిస్తూ సొంత నోట్సు తయారు చేసుకుంటే కొలువు సాధించడం కష్టమేమీ కాదని అఖిల చెబుతోంది.
- పూరేళ్ల అఖిల, నర్సాపూర్

ఇంటి బాధ్యతలు మోస్తూ..



దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందన పూరేళ్ల లక్ష్మణ్, ఉమ దంపతుల కుమార్తె అనూష పది, ఇంటర్ స్థానికంగా చదువుకుంది. వివాహమైనా చదువు కొనసాగించింది. ఇంటి బాధ్యతలు ఉన్నా.. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదువుకుంది. 36వ ర్యాంకుతో ఉపాధ్యాయురాలిగా ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలిచింది. - అనూష, నర్సాపూర్

చిన్నతనం నుంచే మక్కువ



దండేపల్లి మండల కేంద్రానికి చెందిన యాగండ్ల గంగన్న, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె సాయిప్రసూనకి చిన్నతనం నుంచి ఉపాధ్యాయ వృత్తంటే మక్కువ. ఎలాగైనా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని కష్టపడి చదువుతూ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. 18వ ర్యాంకుతో కొలువుకు ఎంపికైంది. - యాగండ్ల సాయిప్రసూన, దండేపల్లి

అభివృద్ధి పనులు చేయడానికి కౌన్సిల్ ఆమోదం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : మంచిర్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేయడానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఛైర్మన్ ఆర్.ఉప్పలయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.60.90 లక్షలతో అభివృద్ధి పనులు చేయటానికి పరిపాలన ఆమోదం తీసుకున్నారు. 14వ ఆర్థిక సంఘం 2016-18 వరకు సంబంధించిన మిగులు నిధులు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి ఆమోదించారు. మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ కేసులను వాదించడానికి న్యాయవాదికి రుసుం చెల్లించడానికి రూ.3.65 లక్షలు చెల్లించడానికి అంగీకరించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి డ్రోన్ ద్వారా సర్వే చేయడానికి నిర్ణయించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహేష్, కమిషనర్ మారుతీ ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజినీరు మసూద్ అలీ, టీపీఓ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : తమ భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తన భర్త ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితురాలు కుశుమల డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రిలో మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకునే తన భర్త దాసరి రాజేష్‌ను మంచిర్యాలకు చెందిన బొంతల వినయ్, కొత్తపల్లి శ్రీనివాస్‌లు మోసం చేశారని ఆరోపించారు. అప్పుగా ఇచ్చిన డబ్బుకు ఇరవశాతం వడ్డీ వసూలు చేశారన్నారు. అతికష్టం మీద అప్పు తీర్చినప్పటికీ ఇంకా డబ్బులు ఇవ్వాలంటూ వేధించారని పేర్కొన్నారు. అంతేకాకుండా తమ పేరిట ఉన్న 1.12 ఎకరాలను వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయారు. ఈ క్రమంలో కలత చెందిన రాజేష్ మూడు రోజుల క్రితం సెల్ఫీ వీడియో తీసుకుని హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీటి పర్యంతం అయ్యారు. వారి పేరిట చేసుకున్న అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తనతో పాటు కూతురు హన్వికకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ విషయమై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఉద్యోగ విరమణ పొందిన వారితో సీపీ, ఇతర అధికారులు

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబసభ్యులను ఆయన ఘనంగా సత్కరించారు. అదనపు డీసీపీ (పరిపాలన) రాజు, ఏసీపీలు సుందర్, ప్రతాప్, ఏవో అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

మంచిర్యాలనేరవిభాగం : పోలీసుశాఖలో పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ఏఎస్సైలుగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు ఎస్సైలుగా పదోన్నతి పొందారు. సోమవారం వారికి సీపీ ర్యాంకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు

అవయవ దానంపై అపోహలు వీడాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : అవయవ దానంపై అపోహలు వీడి మరణానంతరం వాటిని దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు పేర్కొన్నారు. సోమవారం రవీంద్రఖని-న్యూటెక్ గని వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ దానంపై అవగాహన కల్పించారు.

గుండె వ్యాధులపై అవగాహన తప్పనిసరి

శ్రీరాంపూర్ గ్రామీణం: ఉద్యోగులందరికీ గుండె సంబంధిత వ్యాధులపై తప్పకుండా అవగాహన ఉండాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రఖని-8 డిస్పెన్సరీలో అవగాహన నిర్వహించారు. అనంతరం గుండె వ్యాధులు, వాటి నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు.

సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కృషి, పట్టుదలతో ఉద్యోగులు సేవలు అందిస్తుండటంతో సంస్థ ప్రగతి పథంలో దూసుకెళ్తుందని ఆర్కే-7 గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు పేర్కొన్నారు. సోమవారం రవీంద్రఖని-న్యూటెక్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గనిలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను గని ఎస్ఓఎం స్వామిరాజుతో కలిసి సన్మానించారు.

హక్కుల రక్షణకు పోరాటాలు

శ్రీరాంపూర్ గ్రామీణం: రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ పోరాటాలు చేస్తుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రవీంద్రఖని-5 గని వద్ద మాట్లాడారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత

శ్రీరాంపూర్ గ్రామీణం : రవీంద్రఖని-7 గనిలో ఆగస్టులో ఎక్కువ టబ్బులు నింపిన ఎస్డీఎల్ ఆపరేటర్లు పల్లెర్ల తిరుపతి, మారెపల్లి సారయ్యకు ఏజెంట్ ఎం.రాముడు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సోమవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం

శ్రీరాంపూర్ గ్రామీణం : కార్మికుల రక్షణ, సంక్షేమంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్కే-5 గనిలో జరిగిన దొంగతనానికి యాజమాన్యం బాధ్యత తీసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విరమణ జీవితం కుటుంబంతో గడపాలి

కాసిపేట, న్యూస్‌టుడే : ప్రతి ఉద్యోగికి విరమణ అనేది సహజమని, విరమణ జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలని మేనేజర్ భూశంకరయ్య అన్నారు. కాసిపేట గనిలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు కుమారస్వామి, దామోదర్, చోటిన్‌లను అధికారులు ఘనంగా సన్మానించారు.

నిబంధనలు ఎత్తివేయాలని డిమాండ్

మందమర్రి పట్టణం: కార్మికుల ప్రాణాలు కాపాడే పారా మెడికల్ సిబ్బందికి సంబంధించిన ఎన్ మైనస్ వన్, పీహెచ్‌డీలో 50 శాతం నిబంధనలను ఎత్తి వేయాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో మాట్లాడారు.

అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

మందమర్రి పట్టణం: లాభాల వాటాపై కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మందమర్రి కేకే5 గనిపై ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా సన్న ధాన్యం సేకరణ

హాజీపూర్, న్యూస్‌టుడే : హాజీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీసీ) ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్న వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ డైరెక్టర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన బియ్యాన్ని వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో బియ్యం సేకరణ చేసేందుకు నిర్ణయించామన్నారు. నాబార్డు ద్వారా రుణం తీసుకునేలా తీర్మానం చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎఫ్‌పీసీ గౌరవ సలహాదారుడు శ్యాంసుందర్‌రావు, సహకార బ్యాంకు మేనేజర్ తిరుపతి, ఎఫ్‌పీసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అంధకారంలో కొత్తపల్లి వీధులు

భీమారం : కొత్తపల్లిలోని మూడవ వార్డులో కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక అవస్థలు పడతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో పాములు, విష పురుగులు రహదారులపైకి వస్తున్నాయని బయటకు రావాలంటే భయంతో జంకుతున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన 18 మంది అండర్-17 స్కూల్ గేమ్స్ డివిజన్ స్థాయి పోటీలకు సోమవారం వెళ్లారు. జోనల్ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి డివిజన్ లెవల్‌కు వెళుతున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అభినందించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమ, మంగళవారం జరుగనున్న డివిజన్ లెవల్‌లో రాణించాలని కోరుతూ విద్యార్థులను పోటీలకు పంపించారు.

సాదాసీదాగా పుర కౌన్సిల్ సమావేశం

నస్పూర్, న్యూస్‌టుడే: నస్పూర్ పుర కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఛైర్మన్ సుర్మిళ్ల వేణు అధ్యక్షతన బల్దియా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలో 29 అంశాలను పొందుపరచగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురపాలికలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కమిషనర్ సతీష్, వైస్ ఛైర్‌పర్సన్ గెల్లు రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సంధ్యారాణికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు.

ముందస్తు బతుకమ్మ

దండేపల్లి: దండేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

జీవో 25ను సవరించాలి

మంచిర్యాల విద్యావిభాగం: జీవో 25ను సవరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల మండలంలోని పలు పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ఈ ప్రాంతం మల్బరీ సాగుకు ఎంతో అనువైనది

జన్నారం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మల్బరీ సాగుకు ఎంతో అనువైనదని రైతులు అందుకోసం ముందుకు రావాలని పట్టుపరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ డా.లత అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ రైతు వేదికలో సోమవారం ఉమ్మడి జిల్లా రైతులకు పట్టుపరిశ్రమ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ లత మాట్లాడుతూ ఒక ఎకరా సాగుకు రూ. 7 లక్షల వరకు ఖర్చవుతుందని అందులో 50 శాతం కేంద్ర ప్రభుత్వం సబ్సీడీగా ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అండ్ హెడ్ ఆఫ్ ది ఆర్ఎస్ఆర్ఎస్ ములుగు డా.వినోద్‌కుమార్‌యాదవ్, టెక్నికల్ ఆఫీసర్ డా.రాఘవేందర్, మంచిర్యాల డీహెచ్ఎస్ఓ డా.అనిత, సహాయ సంచాలకులు పార్వతి, సురేందర్, పరిశ్రమశాఖ ఆదిలాబాద, జగిత్యాల జిల్లా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : కేరళలోని కజకూటంలోని సైనిక్ పాఠశాలకు పట్టణంలోని ది హ్యాప్పీ స్కాలర్ పాఠశాల విద్యార్థిని భార్గవి ఎంపికైనట్లు కరస్పాండెంట్ విక్రమ్‌రావు తెలిపారు. భార్గవిని సోమవారం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.



భార్గవిని అభినందిస్తున్న విక్రమ్‌రావు

సంక్షిప్త సమాచారం

ఆర్థిక సాయం చెక్కు అందజేత

కోటపల్లి : ఇటీవల మృతిచెందిన కోటపల్లి మండలం పుల్లగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ క్రియాశీలక సభ్యుడు రావుల రాజమల్లయ్య కుటుంబానికి పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును సోమవారం సంఘ సభ్యులు అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అకాల మరణం పట్ల నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్, కోమట్ల బాపు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రి పట్టణం: రామకృష్ణాపూర్‌లో భారాస నాయకుడు కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు మంజూరైన బీమా రూ.2 లక్షల చెక్కును సోమవారం నాయకుడు రమేష్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పాత విద్యుత్తు దీపాలు పెట్టొద్దు

భీమిని: పాత విద్యుత్తు దీపాలు స్తంభాలకు అమర్చొద్దని అడ్డుకున్న ఘటన భీమిని మండలం మల్లీడి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంలో చోటు చేసుకుంది. గ్రామంలో నెల రోజులుగా విద్యుత్తు దీపాలు వెలగక చీకటి అలుముకుంది. విద్యుత్తు దీపాలు పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని కోరినట్లు వారు తెలిపారు. సోమవారం గ్రామంలోని విద్యుత్తు స్తంభాలకు పాత విద్యుత్తు దీపాలు పెట్టడానికి సిబ్బంది వచ్చారు. పాతబడిన విద్యుత్తు దీపాలు పెట్టొద్దంటూ అడ్డుకున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఎస్సైగా పదోన్నతి

భీమారం: భీమారం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న భూమన్నకు ఎస్సైగా పదోన్నతి లభించింది. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తర్వులతో పాటు స్టార్ పొందారు.

లడ్డు ప్రసాదం కల్తీపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

సత్ప్రవర్తనతో ఉండాలి

మందమర్రి పట్టణం: నేర ప్రవృత్తిని వీడనాడి సత్ప్రవర్తనలో ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హితవు పలికారు. సోమవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లకు మార్పుకోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. మంచిగా ప్రవర్తనతో జీవిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే సమగ్ర విచారణ అనంతరం రౌడీ షీట్‌ను తొలగించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సామూహిక సీమంతాలు

జైపూర్: గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఏసీడీపీవో శ్రావణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో పోషకాహారంపై అవగాహన కల్పించి సామూహిక సీమంతాలు నిర్వహించారు.